


# దొడ్డ మనసు

ఉదయభానుడి తీవ్రతకి భయపడి రోడ్డుమీద ఒక్క పిట్టకూడా కనపడటం లేదు

స్వయంగా జీపు నడుపుతున్న గోపాల్ వీధి చివర పెంకుటింటి ముందు జీపు ఆపుచేసి దిగాడు ఒక్క క్షణం ఆగి ఆ ఇంటి వైపుకి చూసాడు అనిర్వచనీయమైన ఆనందంతో మేను పులకరించింది

జీపు ఆగిన శబ్దానికి యిరుగు పొరుగులు తొంగి చూస్తున్నారు

మెట్లెక్కి తలుపు దగ్గర ఆగిన గోపాల్ "మాష్టారూ!" అని పిల్చాడు

'ఎవరూ?' అంటూ పక్కనున్న కళ్ళజోడు అందుకుని వధిలోకి వంగి చూసాడు తారకంగారు

"నేను మాష్టారూ! మీ శిష్యుడిని, పరాశరంగారి అబ్బాయి గోపాల్ ని అంటూ దగ్గరగా వచ్చి తారకం గారి కాళ్ళని తాకి పక్కనే కూర్చున్నాడు

నువ్వాబాబూ! ఎంత పెద్దవాడి వయ్యావోయ్! ఎప్పు డొచ్చావు? నాన్నా, అమ్మా బాగున్నారా? చెల్లాయిలు ఏ వూళ్ళల్లో వున్నారు? అంటూ ప్రశ్నమీద ప్రశ్న వేస్తూ పక్కనే కూర్చున్న తన చేతుల్ని ఆప్యాయంగా నిమురుతున్న తారకంగారి వంక చూసాడు గోపాల్

పదిహేనేళ్ళల్లో ఆయనలో ఎంతో మార్పు వార్ధక్యంతో పాటు అనారోగ్యం ఆయన ఆకారాన్నే మార్చేసింది ఓ కాలూ, చెయ్యీ స్వాధీనం లేవు పడక్కుర్చీలో కూర్చున్న తారకంగారు, మంజూ! మంచినీళ్ళు పట్రా ఎవరొచ్చారో చూడమ్మా! మనింటికీ అంటూ కేక వెయ్యగానే మంచినీళ్ళ గ్లాసుతో వచ్చింది మంజు పిలక జడా, మోకాళ్ళ క్రిందదాకా గౌనుతో చిన్నపుడు తనతో ఆటలాడిన మంజులేనా?! అన్నట్లుగా ఎదిగిన మంజులలో పల్లెటూరి పడుచుతనపు అందం సంతరించుకుంది.

"ఏం మంజూ! బాగున్నావా? నన్ను గుర్తుపట్టేవా? అని అడిగిన దానికి సిగ్గుపడుతు తలూపి మంచి నీళ్ళ గ్లాసు పక్కన పెట్టి వెళ్ళి గుమ్మం దగ్గర నిలబడింది

ఆ మనుష్యుల్లో కాలం తెచ్చిన మార్పు తప్ప మరే మార్పూ ఆ ఇంట్లో కనపడటం లేదు అసలు ఆ ఇంట్లోనే కాదు ఈ వూరే ఏమీ మారినట్లు తనకి అనిపించటం లేదు

తండ్రి ఉద్యోగరీత్యా ఈ వూళ్ళో తమ కుటుంబం తారకం మేష్టారి గారింటి ఎదురింట్లోనే కాపరం వుండటంతో ఈ రెండు కుటుంబాల మధ్య సాన్నిహిత్యం ఎక్కువయింది

స్కూల్లో తారకం మేష్టారంటే పిల్లలందరికీ హడలే ఇంటి దగ్గర మాత్రం మేష్టారి గారంత మంచి వ్యక్తి లేడనిపించేది గోపాల్‌కి

తారకం మేష్టారికి నలుగు రాడపిల్లలు అందరిలోకి ఆఖరిది మంజుల తన కన్నా చిన్నది కావడంతో యిద్దరూ కలిసి కబుర్లు, కథలు చెప్పుకుంటూ, కలిసి తిరిగేవారు తారకం మేష్టారు తనకి అర్థం కాని పాఠాలని నయాపైస ఆశించకుండా నిస్వార్థంగా గంటల తరబడి యింటి దగ్గర చెప్పేవాడు ఆ విధంగా కూడా గోపాల్‌కి ఆయనతో చనువు పెరిగింది

తను ఎనిమిదో తరగతి చదువుతూ వుండగా తండ్రికి బదిలీ కావడంతో గోపాల్ కుటుంబం ఆ వూరు వదిలెయ్య వలసి వచ్చింది మళ్ళీ యిన్నేళ్ళ తరవాత ఈ వూరికే ఆఫీసు పనిమీద రావలసి వచ్చింది ఈ వూరి పక్కనే కడుతున్న బ్రిడ్జి నిమిత్తం తన నీ వూరు పంపిస్తున్నారని తెలీగానే ఏదో అనిర్వచనీయమైన ఆనందం కలిగింది గోపాల్‌కి చిన్ననాటి స్మృతులు మనసుని స్పందించాయి ముఖ్యంగా తారకం మేష్టారి అభిమానం, ఆప్యాయత గుర్తొచ్చి, వూళ్ళో దిగిన దగ్గర నుంచీ ఎప్పుడెళ్ళి మాష్టారిని చూద్దామా అన్న ఆతృతని చంపుకోలేక గెస్టుహవుస్‌లో దిగగానే స్నానం చేసి తిన్నగా మాష్టారింటికే వచ్చాడు

ఆయన ఆప్యాయత, ఆశీర్వచనమే తనీనాడు యింజనీరవడానికి కారణం విద్యార్థిని సొంత బిడ్డలా ఆదరించి ఆనాడు తనకి నిస్వార్థంగా పాఠాలు బోధించి వుండకపోతే తనింతటి ఉద్యోగస్తుడయ్యేవాడే కాదేమో! మేష్టారు తీర్చి దిద్దిన విద్యార్థులు వేలకి వేలు గడించుకుంటున్నా, తీర్చిదిద్దిన వ్యక్తిలో మాత్రం ఆర్థికంగా ఏమార్పూ కనపడటం లేదు

కుశల ప్రశ్నలయ్యాక 'ఏం బాబూ! పెళ్ళయిందా?



కందుకూరి వెంకట మహాలక్ష్మి

పిల్లలా? అని అడిగిన దానికి, మీకు తెలీకుండా అవుతుందా మాష్టారూ! మొన్ననే కుదిరింది తాంబూలాలు పుచ్చుకున్నారు పెళ్ళి వచ్చే నెల్లోనే మీరు తప్పక రావాలి పెళ్ళి కూతురిది హైదరాబాద్ పి హెచ్ డి చేసింది అని సిగ్గుపడుతూ చెప్తున్న గోపాల్ భుజం చరిచి, చాలా సంతోషం బాబూ! మీరంతా మా కళ్ళముందు పుట్టి, పెరిగి పెద్ద పెద్ద ఉద్యోగస్తులయ్యారు ఇంకా వృద్ధిలోకి రావాలి నాయనా! నేనీ స్థితిలో నీ పెళ్ళికి రాలేను గానీ నా ఆశీర్వచనాలు ఎప్పుడూ నీ కుంటాయి నాయనా!" అంటూ వంటింటి వైపుకి తిరిగి మంజూ! వంటయిందా? నాకూ, గోపికీ వడ్డించెయ్యి" అంటూ కూతుర్ని ఆదేశించాడు

చిన్న బల్ల వేసి తండ్రికీ, తనకీ ఆ గదిలోనే అసలైన ఆంధ్రుల వంటకాలతో భోజనం వడ్డించింది మంజు హోటలు మెతుకులు తిని, తిని విసిగి పోయిన గోపాల్‌కి ఆ వంటకాలు అమృతం లాగున్నాయి

భోంచేస్తూ మేష్టారి కుటుంబం గురించి అడిగాడు గోపాల్ 'పెద్ద పిల్లలు ముగ్గురూ వారి వారి అత్తారిళ్ళల్లో వున్నారు బాబూ! పెద్దల్లుడు తాలూకా ఆఫీసు గుమాస్తా, రెండో అల్లుడు టైపిస్టు, మూడో అల్లుడు టీచరుగానూ వున్నారు ఏదో బాబూ! ఆ ముగ్గురూ వాళ్ళ పిల్లా పాపల్తో వాళ్ళ సంసారాల్ని ఈదు కొంటున్నారు ధరలు మండిపోయే ఈ కాలంలో వాళ్ళ కొచ్చే జీతాలు ఏం సరిపోతాయి చెప్పు! నేను మాత్రం ఏం చెయ్యగలను? ఆ ముగ్గుర్ని అత్తవారిళ్ళకి పంపడానికి నా సర్వస్వం ధారపోసాను నా కంటూ మిగిలింది ఈ కొంప ఒక్కటే- వచ్చే పెన్షన్‌తో అతి కష్టంమీద రోజులు గడుస్తున్నాయి నా భార్య పోయాకా యింటి బాధ్యత, మంజుల మీద పడింది దానికి సాయం దేముడు నా కాలూ/ చెయ్యి లేకుండా చేసాడు మంజుకి పెళ్ళి చెయ్యాలి సంబంధాలు చూడాలన్నా నేను తిరగలేను నీలాగే అభిమాన మున్నవాళ్ళు పెళ్ళి కొడుకుల్ని తీసుకొచ్చి పిల్లని చూపిస్తున్నారు వాళ్ళ కోరికల్ని తీర్చే స్తోమతలేక వూరుకున్నాను బాబూ! పిల్లా- సంసార పక్షంగా వుంటుంది చదువా- ఈ వూళ్ళోవున్న దానితో చాలించింది ఈ రోజుల్లో బాగా కట్న మన్నా యివ్వగలగాలి, లేదా పెద్ద చదువు చదివి ఉద్యోగమన్నా చేస్తూ వుండాలి లేదా రంభలాగన్నా వుండి వుండాలి ఈ మూడింటితో పోటీపడలేని మంజుని కాలం ఏమాత్రం కనికరించకుండా పాతికేళ్ళని దాటించేసింది నాయనా! మొన్న ఓ సంబంధం తీసుకొచ్చాడు నా స్నేహితుడు పిల్లని చూసెళ్ళి పది వేలిస్తే వప్పుకుంటా"మని కబురు చేసారు సంబంధం మంచిదే కానీ పదివేలు ఎక్కడినుంచి తేను?! ఇంకా వాళ్ళ కేకబురూ చెయ్యలేదనుకో! ఇప్పుడు నా అనారోగ్యం కంటే నాకు ఎదురైన పెద్ద సమస్యల్లా దీని పెళ్ళే బాబూ! అంటూ మాష్టారు చెప్తున్నప్పుడు తలెత్తి మంజులని చూసాడు ఎటో చూస్తున్న ఆమె ముఖంలో ఏ భావమూ చదవలేక పోయాడు గోపాల్

'ఇంకొంచెం మజ్జిగ పోసుకోండి" అంటూ గోపాల్ ముఖంలోకి చూసి అతనూ తన్నే చూస్తున్నాడని తెలీగానే తల దించేసుకొంది అల్లరిగా, చిలిపిగా, గిల్లికజ్జాలు పెట్టుకుంటూ తన వెంట తిరిగే మంజుల ఈ రోజింత గంభీరంగా, బిడియంగా తనని ఎరగనట్లే ప్రవర్తించడం గోపాల్‌కి ఆశ్చర్యంగానూ, బాధగానూ వుంది

చేతులు కడుక్కుని రాగానే ఓ చేత్తో తువ్వాలు, మరో చేత్తో వక్కపొడి తీసుకొచ్చి పక్కనుంచి వెళ్ళిపోయింది

మేష్టారి సమస్యల్ని విన్న గోపాల్ మనసు కలచి వేసింది ఆలోచనలు పరిపరి విధాల పోసాగాయి

తనీనాడు నాలుగు వేలు గడించు కుంటున్నాడు ఎవ్వరికీ సయాపైస పంపక్కర లేదు బ్యాంకిలో వేసుకున్న సొమ్ముతో తారకం మాష్టారికి సహాయపడితే!' అన్న ఆలోచన రాగానే గోపాల్ మనసెందుకో గాలిలో తేలిపోయింది మెల్లిగా ఆయన పక్క కొచ్చి కూర్చుని, మొన్న పదివేలడిగిన సంబంధం ఖాయం చెయ్యండి మాష్టారూ! నేనా కట్నం డబ్బు యిస్తాను పెళ్ళికయ్యే ఖర్చు కూడా నేను చూసుకుంటాను నన్నింతటి వాడిని చేసిన ఋణం కాస్తన్నా ఈ విధంగా తీర్చుకోనియ్యండి, కాదనకండి అంటూ తన చేతుల్ని పట్టుకున్న గోపాల్‌ని చూసి తారకం గారి మనసు ఆర్ద్రమయి కంట్లోంచి జలజలా రాలిన నీటి బిందువుల్ని చూసిన గోపాల్ మనసు చలించి పోయింది

మళ్ళీ రేపొస్తాను మాష్టారు! ఆ పెళ్ళి వారికి ఉత్తరం రాద్దాం. నేను వెళ్ళాలి టైమవుతోం దని చెప్పిన గోపాల్‌ని మూగగానే సాగనంపాడు తారకం గారు

ఏదో అనిర్వచనీయమైన ఆనందానుభూతితో అక్కడి నుంచి బయలుదేరిన గోపాల్ లోపల మంజు కనపడుతుందని, ఆమె ముఖంలోని ఆనందాన్ని కూడా చూడాలని ఆశించాడు కానీ నిరాశే ఎదురయింది

గెస్టుహవుస్‌లో పడుకున్న గోపాల్‌కి చిన్ననాడు ఆడిపాడిన వూరు వచ్చి మేష్టారిని చూసినప్పుడు కలిగిన ఆనందం కన్నా, ఆయనని ఆదుకుని ఆయన సమస్యని పరిష్కరిస్తున్నందుకు కలిగిన ఆనందం రెట్టింపయింది అంతటితో అతని మనస్సాగటం లేదు మాష్టారిని తీసికెళ్ళి పట్నంలో మంచి వైద్యం చేయించాలని కూడా నిశ్చయించు కున్నాడు ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న గోపాల్ ఆలోచనలు ఒక్కసారి బ్రేక్ వేసినట్లు ఆగిపోయాయి కారణం- ఎవరో తలుపు తట్టినట్లు కావడమే!

లేచి తలుపు తీసిన గోపాల్ స్తంభంలా నిలబడి పోయాడు. ఎదురుగా మంజు!! గోపాల్‌కి మతి పోయింది టైము రాత్రి ఎనిమిది కావస్తోంది ఆ వూళ్ళో భోజనాలు చేసి నిద్రకుపక్ర మించేవేళది ఆ టైములో! అందునా మంజుల!! ఉదయం యింటి

కెళ్ళినప్పుడు నోరు విప్పి ఒక్కమాట మాట్లాడని ముగ్ధ ఒంటరిగా తన గెస్టుహవుసుకి రావడమా!!!

తేరుకున్న గోపాల్, 'రా మంజూ! లోపలికి అని అహ్వానించి కుర్చీ చూపించాడు ఆ తరవాత ఏం మాట్లాడాలో అర్ధం కాలేదు తలొంచుకుని గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్న మంజులని చూస్తూ కూర్చుండిపోయాడు నిశ్శబ్దం భరించరానిదయింది అఖరికి తెగించి, "ఏం మంజూ! ఇలా వచ్చావు? నాన్నగారి ఆరోగ్యం ఏమన్నా " అన్న మాటల్ని పూర్తికానివ్వకుండానే "బాగానే వున్నారు నేను వచ్చిన పని వేరు అంది సూటిగా అతన్ని చూసి ఏమిటి?" అన్నట్టు నొసలు చిట్లించి చూస్తున్న గోపాల్‌కి మెడలోంచి పసుపుతాడుని కట్టిన మంగళసూత్రాలని తీసి చూపించింది వెర్రివాడిలా, "అవేమిటి? నీకు పెళ్ళయిందా?! మరి మాష్టారికి .!!" అంటున్న మాటలకి మళ్ళీ అడ్డు వస్తూ, 'అవును నాకు చిన్నతనంలోనే పెళ్ళయి పోయింది ఇంక నా పెళ్ళి ప్రయత్నం చెయ్యకండి' అంది

"అయితే మాష్టారి కెందుకు చెప్పలేదీ విషయం?" అన్నదానికి పేలవంగా నవ్వి, "చెప్పవలసిన అవసరం రాలేదు నాన్న నాకు పెళ్ళి చెయ్యలేరని తెలుసు. అందుకే అయనకి చెప్పి బాధించ దల్చుకోలేదు నాన్న తృప్తి కోసం వచ్చిన పెళ్ళివారి ఎదురుగా కూర్చుంటున్నానంతే! ఈ రోజు నా పెళ్ళయిపోయిందని చెప్పవలసిన అవసరం వచ్చింది గనకే, ఈ రాత్రివేళ యిలా వచ్చాను మీరు నాన్న కిచ్చిన మాట విన్నాను. దయచేసి ఆ ప్రయత్నం విరమించుకుని మీ పని కాగానే ఈ వూరి నుంచి వెళ్ళిపొండి" అంటూ లేచింది మంజుల.

"అసలు మాటలు వచ్చా?' అన్నట్టు ప్రవర్తించిన మంజులేనా యింత ధైర్యంగా, నిక్కచ్చిగా మాట్లాడుతుంట! అన్న ఆలోచన అశ్చర్యంతో పాటు, ఆమె బర్త ఎవరు? ఆ కథ ఏమిటి? అన్న సందేహాలు తలెత్తి, తెలుసుకోవాలన్న ఆతురతతో వెళ్ళబోతున్న మంజుకి అడ్డుగా నిల్చి, "నీ భర్త ఎవరు చెప్పు మంజూ! మీ మధ్య

## దొడ్డ మనసు

ఏవన్నా కలతలు, గొడవలు వుంటే నేను చెయ్యగలిగింది చేసి మీ కాపరం సరిదిద్దుతాను" అన్న దానికి సూటిగా చూస్తూ, 'మీకా శ్రమ అక్కర లేదు నా భర్త ఎవరో కాదు మీరే" అంది

గోపాల్ ఆ మాటలకి చేష్టలుడిగి శిలలా నిలబడిపోయాడు మంజు మెళ్ళోని మంగళ సూత్రాలని చూస్తూ క్షణ క్షణానికి అతని మెదడు మొద్దుబారిపోయేలా వున్నాయి మంజుల మాటలు

వెల వెలపోతున్న బంగారం రంగులో వున్న రెండు బిళ్ళలకి కన్నాలు కొట్టి తాడు కెక్కించి వున్నాయా మంగళసూత్రాలు

'నేను నీ భర్తనేమిటి? నిన్నెప్పుడు పెళ్ళాడాను?" అన్నాడు కొంచెం కోపంగానే.

'గుర్తు తెచ్చుకోండి గోపాల్! మన వూరి కరణంగారి అమ్మాయి పెళ్ళికి మనందరం అన్నవరం వెళ్ళాం ఆ పెళ్ళయిన మండపంలోనే మన మంతా అడుకుంటూ పెళ్ళి కూతురూ, పెళ్ళి కొడుకూ లేచి వెళ్ళగానే ఆ పీటలమీదే మనిద్దరం కూర్చున్నాం ఇంతలో మన స్నేహితులంతా వచ్చి "మీ యిద్దరికీ పెళ్ళి చేస్తాం" అంటూ సోడా సీసాల మూతలకి కన్నాలు కొట్టి, తాడు కెక్కించి మీ చేత నాకు ముడేయించారు అక్కడే పడున్న తలంబ్రాలు పోయించారు మండపం చుట్టూ తిప్పారు ఆ తరవాత నుంచి మనిద్దర్నీ మన స్నేహితులంతా బార్యాభర్తలనే పిల్చేవారు. నువ్వు కూడా అప్పటి నుంచీ భార్యని గదమాయించినట్టే గదమాయించి, అన్ని పన్లూ చేయించుకోడమే కాకుండా, ఈ ఊరి నుంచి వెళ్ళేవరకూ నా పెళ్ళానివి" అనే అనేవాడివి మనం ఎప్పుడు ఏ అట అడినా నువ్వు నాన్నగా, నేను అమ్మగా అడుకునేవాళ్ళం చూడండి గోపాల్! ఆడదానికి ఒక్కడే భర్త, పుస్తె అన్నది పసుపుకొమ్మయినా, బంగారం దయినా, సోడా బిళ్ళయినా ఏదైనా పుస్తె!! నాకు చిన్నప్పుడే గుడిలో దేముడి సమక్షంలో మీతో పెళ్ళయి పోయింది పల్లెటూరిదాన్నని, మూర్ఖురాలి ననండి ఆ పెళ్ళి నా మనసులో శాశ్వతంగా ముద్రపడి పోయింది నేనింక ఎవ్వర్నీ పెళ్ళాడలేను నాకు మీరే భర్త దయచేసి నాకు మరో పెళ్ళి చేసే ప్రయత్నం చెయ్యకండి అలా జరిగితే నేను ఏ నుయ్యో, గొయ్యో చూసుకోవలసి వస్తుందని చెప్పడానికే వచ్చాను వస్తా–" అంటూ చకచకా వెళ్ళి పోయింది

కొయ్యబొమ్మలా మంజూ వెళ్ళిన వైపే చూస్తూ నిలబడి పోయాడు గోపాల్ బుర్ర బద్దలయిపోతోంది. ఏం తోచటం లేదు గతమంతా గుర్తొస్తోంది "మంజూ చెప్పిన మాటలు అన్నీ నిజాలే! చిన్నతనంలో ఆడుకున్న ఎన్నో అటల్లో అదీ ఒకటిగా అనుకుని మర్చిపోయాను. మంజూ మనసులో మాత్రం శాశ్వతమైన ముద్రపడి పోయిందన్నమాట పల్లెటూళ్ళల్లో చిన్న వయసులోనే వివాహాలు జరపడం చూసిన మంజ మనసులో ఆ సంఘటన నిల్చిపోవడం సహజం కావచ్చు– కానీ తనిప్పుడేం చెయ్యగలడు? ఏం చెయ్యాలి??" ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోసాగింది ఓ పక్క తన పెళ్ళి పన్లు జరిగి పోతున్నాయి ముహూర్తాలు పెట్టారు హే భగవాన్! ఎందుకొచ్చా నీ వూరికి??" అంటూ రెండు చేతుల్తో తల పట్టుకుని కృంగిపోసాగాడు


తెల్లారి లేచిన గోపాల్ ఏదో నిర్ణయాని కొచ్చినవాడిలా లెటర్‌పేడ్ తీసి తండ్రికి, తన కాబోయే భార్య ఉమకి రాత్రి జరిగిన సంఘటన రాసి, చివరగా తన నిర్ణయం కూడా రాసి వేసాడు

తిరుగు టపాలో తండ్రి వద్దనుంచి ఉత్తరం వచ్చింది ప్రారంభం నుంచి, అఖరివరకూ వెర్రి

## ఓ ఉగాదీ!

మా నాయకులు అయిదేళ్ళ కోసారి కనిపించి
యోగక్షేమాలడుగుతారు!
నువ్వేనయం సంవత్సరానికొకసారి
మా అతీగతీ పట్టించుకొంటావ్!
నిరుటికీ ఈ ఏటికీ మాస్థితి గతులు అలాగే ఉన్నాయ్
అదిక ధరలతో అతలాకుతలమై
కరువు కాటకాలతో కృంగి పోతున్నాం
కల్తీ రక్కసి పీడ
ధ్వని కాలుష్యపు చీడ
మా గుండెల్ని దడదడ లాడిస్తున్నాయ్
ఈ మధ్యే ఫోటో లు దిగాం
ఓట్ల కోసం, రేషన్ కార్డుల కోసం
ఫోటోల్లోని మా ముఖార విందాలు చూసి
నువ్వు దిమ్మెర పోతావ్
దిగుళ్ళతో కళావిహీనా లైన మొహాలు మావి!
నీ ఏలుబడిలో నైనా మాకు చిరునవ్వులు
ప్రసాదించు ఉగాదీ!
ఆనందాలు పంచు ప్రభవ సంవత్సరాదీ!

–కొడిమెల శ్రీరామమూర్తి



కోపంతో తిట్టిన తిట్టు తిట్టకుండా రాసిన ఉత్తరం చదివి మనసు బాదగా మూలిగింది కావాలంటే ధన సహాయం చెయ్యాలి గానీ మూర్ఖపు నమ్మకానికి బలి కావద్దని, నా మాట కాదన్నావంటే నీకూ, నాకూ చెల్లని చివరిగా రాసాడు

ఇంక యివాళో, రేపో వచ్చే ఉమ వుత్తరంలో ఎన్ని బహుమతు లుంటాయో! అని ఆలోచిస్తూ ఆ ఉత్తరాన్ని పక్కగాపెట్టాడు

మేష్టారితో తన నిర్ణయం చెప్పినప్పుడు మాటలురాని మూగవాడిలా కృతజ్ఞతనంతా చూపుల్లో నింపుకున్నట్టుగా గోపాల్‌ని చూసి తల దించుకున్నాడు తారకంగారి కళ్ళ నుండి జలజలా రాలిన నీటి బిందువులు ఆనందాశృవులో వ్యధతో కూడినవో తెలుసుకోలేక గోపాల్ ఆయన రెండు చేతుల్నీ పట్టుకుని కళ్ళ కద్దుకున్నాడు ధైర్యం చెప్తున్నట్టు

ఏ ఆడంబరమూ లేకుండా ఆ వూరి పెద్దల సమక్షంలో గుళ్ళో మంజులని వివాహం చేసుకుంటున్నాడు గోపాల్

గోపాల్ తల్లి, తండ్రులు రాలేదు తోటి ఉద్యోగులు మాత్రం నలుగు రైదుగురు హాజరయ్యారు

అంతలో వచ్చి ఆగింది టేక్సీ అందులోంచి దిగింది ఉమ గోపాల్ గుండె దడదడలాడింది కాళ్ళు వణకసాగాయి తండ్రి తిట్లు, చీవాట్లు ఉత్తరంతోటే సరిపెట్టాడు ఉమ స్వయంగానే వచ్చింది ఎంత రసాబాసుచేసి అల్లరి పెడుతుందో బగవంతుడా! అని గాబరాపడసాగాడు ఎదురెళ్ళి ఆమె రెండు చేతుల్నీ పట్టుకుని తలొంచుకున్నాడు క్షమించ మన్నట్టుగా ఉమ చిరునవ్వుతో "మంజుల ఏదీ? అంటూ మంటపం వద్దకి నడిచి పెళ్ళికూతురి చెయ్యి పట్టుకుని తీసుకొచ్చి, పీటలమీద కూర్చోపెట్టి తనే మంజుల తరపున పెద్దగా నిలిచి పెళ్ళి జరిపించడం గోపాల్‌కే కాకుండా ఆ ఊరి వారందరికీ కూడా ఆశ్చర్యం కలిగింది

మధ్యాహ్నం విందు బోజనాలయి వెళ్ళిపోతున్న ఉమకి దన్యవాదా లర్పిస్తూ "నన్ను మన్నించి ఒక స్నేహితుడిగా గుర్తుంచుకోండి ఉమా! అంటూ చేతులు జోడించి నమస్కరిస్తున్న గోపాల్‌ని చూసి చిరునవ్వుతో చూడండి గోపాల్ పెళ్ళిళ్ళు స్వర్గలోకంలో అవుతాయని పెద్దలు చెప్పింది నిజమని ఋజువయింది అది తెలిసి అర్థం చేసుకోలేని వారు కొందరున్నారు ఇక్కడ మూడు రకాల మనస్తత్వాల మద్య మీరు యిరుక్కున్నారు మీ బాధ నేను అర్ధం చేసుకోగలను పట్నంలో పుట్టిపెరిగినదాన్ని నా ఆలోచనలు వేరు పల్లెలో పుట్టి పెరిగిన మంజుల ఆలోచనలు వేరు ఆమెవి ఒక పరిదిలోనే వుంటాయి ఆమె బాహ్య ప్రపంచాన్ని చూడలేదు పెరిగిన వాతావరణాన్ని బట్టి మనిషి యొక్క మనస్తత్వం ఆదారపడి వుంటుంది పల్లెల్లో పిన్న వయసులో వివాహాలు యిప్పటికీ జరుగుతున్నాయి అవే చూసిన మంజుల మనసులో ఆనాటి సంఘటన నాటుకుపోయింది 'దాంతో మిమ్మల్నే బర్తగా ఆరాదించడం సహజం ఇక పోతే నా విషయం-పట్నవాసాల్లో ఎన్నో పెళ్ళిళ్ళు పీటలమీదవి కూడా తప్పిపోవడం చూసిన నాకు యిదేమీ పెద్దగా బాదించడం లేదు చదువుకుని ఉద్యోగం చేసుకుంటున్న నాకు పెళ్ళవడం కష్టం కాదన్నది నా అబిప్రాయం నా కా ధైర్యం వుంది ఇక మీ తల్లి తండ్రుల విషయం వాళ్ళు మనకంటే ఒకతరం ముందు వ్యక్తులు మీరిలా వివాహం చేసుకోడం వారి పెద్దరికాలకి బంగ మన్న దృష్టితోటే , కుదిరిన సంబందం చేసుకోకపోవడం నలుగుర్లో తలవంపు లన్న దృష్టితోటే వారు మిమ్మల్ని మందలించి వుంటారు చూడండి! అంతా వారివారి మనస్తత్వాలని బట్టి నిర్ణయాలు తీసుకుని ప్రవర్తించారంతే! తల్లి తండ్రులకి బిడ్డలమీదొచ్చే కోపం తాత్కాలికమే! మీరు కొడుకు మంజు కోడలూ కాకపోరు వెళ్ళి వారి ఆశీర్వాదం పొందండి మీలాంటి ఉన్నత ఆదర్శ బావాలుగల యువకులు కొందరన్నా వుంటే దేశంలో మేష్టారు వంటి తండ్రులకి కొందరికన్నా సమస్యలు తీరతాయి కాలేజీలో లెక్చర్లివ్వడమే కాదు ఇలా ఆచరణలో పెట్టే మిమ్మల్ని మీ ఔదార్యాన్ని ఎంతో హర్షిస్తున్నానే తప్ప నిందించటంలేదు మీ దొడ్డ మనసుకి జోహార్లు అంటూ శలవుతీసుకుని టేక్సీ ఎక్కుతున్న ఉమని చూస్తూ దొడ్డ మనసు నాదికాదు ఉమా! నిండు హృదయంతో నన్నర్థం చేసుకున్న మహా మనిషివి నువ్వు దేవతవి నిదే దొడ్డ మనసు అంటూ తృప్తిగా ఊపిరి పీల్చాడు 'గోపాల్ □

# ఈ వేమన పద్యాలు




హీన గుణమువాని నిలు చేరనిచ్చిన
నెంతవానికైన నిడుము గలుగు
ఈగ కడుపు జొచ్చి యిట్టట్టు చేయదా
విశ్వదాభిరామ వినుర వేమ